వర్షాధార రైతులకు సాగునీటి సదుపాయం కల్పించాలని అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : నియోజకవర్గంలో బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాలలో కొంతమంది రైతాంగం కేవలం వర్షాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, వెసులుబాటు ఉన్నచోట చెక్ డ్యామ్ లు నిర్మించి, తద్వారా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం సహ కరించాలని కూటమి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) కోరారు. నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారానికి ప్రతి ఎమ్మెల్యేకి కొంత నిధులు కేటాయిస్తే, కొన్ని సమస్యల పరిష్కారానికి ఉపయోగ పడుతుందని తెలుపగా, అందుకు స్పందించిన స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఎమ్మెల్యే బేబీనాయనని మంచి ప్రశ్న అడిగారని అభినందిస్తూ, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఆర్థికశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. ఈ విషయమై ప్రభుత్వం ఆర్థిక వెసులుబాటు కల్పిస్తే, తాను కూడా సంతోషిస్తాని అన్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న హాస్పిటల్స్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ డిమాండ్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉమ్మడి విజయనగరం ఉన్న జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రిల్లో, మెడికల్ కాలేజీలో పని చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు మొదలైన కాంట్రాక్టు వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్న మెడికల్ అధికారులు కాంట్రాక్టర్లు చేత పెరిగిన జీతాలు, పిఎఫ్ బకాయి డబ్బులు, ఈ.ఎస్.ఐ కార్డులు ఎందుకు ఇప్పించలేదని ఎ.పి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో విజయనగరం ఘోష ఆసుపత్రి దగ్గర నిరసన ధర్నా చేపట్టి ఘోష ఆసుపత్రి హెచ్.ఓ.డి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలు, వైద్య కళాశాల నందు టి.వి.టి. కాంట్రాక్టు ఏజెన్సీ వారు ఐదు సంవత్సరములుగా శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సూపర్వైజర్ విభాగాల కాంట్రాక్టు నిర్వహిస్తున్నారని. కాంట్రాక్టు ఏజెన్సీలకి, హాస్పిటల్ సూరింటెండెంట్‌కి మధ్య జరిగిన నియమ నిబంధనలు కాంట్రాక్టు ఏజెన్సీలు ఉల్లంగిస్తున్నారాన్నారు. కాంట్రాక్టర్లకి గత అధికారుల సహకారం కూడా తోడైందన్నారు. శానిటేషన్ వర్కర్లకి, సూపర్వైజర్లకి ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 549 ప్రకారం రూ. 16 వేలు వేతనం చెల్లించుట లేదన్నారు. అదీకాక ప్రతి నెల సక్రమంగా సమయానికి వేతనం చెల్లించకపోవడం జరుగుతున్నదన్నారు. ఇప్పటికీ రెండు నెలలుగా వేతనం చెల్లించలేదని, ప్రావిడెంట్ ఫండ్, కార్మిక రాజ్య భీమా చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అలాగే జూన్ 2025 సంవత్సరం నుండి కొత్తగా వచ్చిన సెక్యూరిటీ కాంట్రాక్టు శ్రీ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ వారు ప్రభుత్వ ఉత్తర్వు నెంబరు 138 ప్రకారం నెలకు సెక్యూరిటీ గార్డులకు రూ. 18,600/-లు, సూపర్వైజర్లకు రూ. 21,506/-లు, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్ కి 18,600, సూపర్వైజర్లుకి రూ. 21,506/- వేతనం చెల్లించాల్సి ఉన్నప్పటికి అతి తక్కువ వేతనం చెల్లిస్తున్నరన్నారు. అదే విధంగా 2 నెలలు వేతనం ఇవ్వలేదన్నారు. హాస్పిటల్లలో తీవ్రమైన పని ఒత్తిడి వలన వర్కర్లు ఇబ్బందులతో అనారోగ్యం పాలవుతున్నా వర్కర్ల సంఖ్య పెంచడం లేదని ఇలాంటి అనేక సమస్యలతో నరక యాతన అనుభవిస్తూ ప్రజలు ఇబ్బంది పడకూడదని ఓర్చుకుని పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయమని అడిగితే మాకు సంబంధం లేదు కానీ మీరు మాత్రం మేము చెప్పినట్టు పనులు చేయాల్సిందే అని కార్మికులను విపరీతమైన ఒత్తిడికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. హాస్పిటల్స్ లో ఉన్న పేషేంట్లకి ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు జీవితాలను ఎన్ని ప్రభుత్వాలు మారుతున్న కాంట్రాక్ట్ దళారీ వ్యవస్థ చేతుల్లో పెట్టేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ వ్యవహార శైలి కూడా యధాతధంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రిల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

సవరవిల్లిలో స్వస్థ్ నారీ స్వశక్త్

విశాలాంధ్ర - భోగాపురం : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మంగళవారం సవరవిల్లి గ్రామంలో సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పోలిపల్లి వైద్యాధికారి కె.మనస్వి మహిళల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన వలు అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత నివా రణ, తలి శిశు సంరక్షణ, గర్భిణీ బాలింతలకు సమతుల్య ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యకర జీవన శైలి, వ్యాధుల నివారణ, మానసిక ఆరోగ్యం కౌన్సెలింగ్, ఆత్మవిశ్వాసం పెంపు వంటి అంశాలను వివరించారు. అలాగే రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వయోవృద్ధులు, కిషోర బాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి స్క్రీనింగ్, మానసిక వైద్య సేవలు, ఆయుష్ సేవలను అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పట్నా తాతయ్యలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గజపతినగరంలో సేవా పక్షోత్సవ వారోత్సవాలు

విశాలాంధ్ర - గజపతినగరం : మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా సేవ పక్షోత్సవాలు జరిపారు. మంగళవారం పురిటిపెంట గ్రామ సచివాలయంలో స్వచ్ఛభారత్ మరియు అమ్మ పేరుతో కొబ్బరి, సపోటా, మామిడి మొక్కలు బిజెపి రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని హాజరై మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఎం భాస్కరరావు, డి దేవుడి బాబు ప్రధాన కార్యదర్శి, కే తవుడు ఉపాధ్యక్షులు, వి సత్యనారాయణ కార్యవర్గ సభ్యులు, ఈశ్వరరావు, పాపి నాయుడు, తవిటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్ కోట ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ కాశి ఈశ్వరరావు (52) విధి నిర్వహణ ఉండగా మంగళవారం బస్సులో గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గంట్యాడ మండలం వసంత గ్రామానికి చెందిన కాశి ఈశ్వరరావు శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తు పట్టణంలోని శ్రీనివాస కాలనీలో సొంతగృహం ఏర్పాటు చేసుకొని భార్య ఇద్దరు ఆడపిల్లలతో నివాసముంటున్నాడు మంగళవారం ఉదయం 6.45 గంటలకు ఎస్ కోట నుండి విశాఖపట్నం వెళ్ళి కించమండ వెళుతున్న ఆర్టీసీ బస్సులో విశాఖ జిల్లా సరిపల్లి వద్దకు వచ్చేసరికి కండక్టర్ ఈశ్వరరావు కి గుండు పోటు రావడంతో కండక్టర్ సీట్ లోనే నిచ్చేతనంగా ఉండి పోయాడని వెంటనే అదే బస్సులో పెందుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఈశ్వరరావు మృతి చెందినట్లు ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

కొండలావేరులో స్వస్థ నారీ సశక్త పరివార్ అభియాన్

విశాలాంధ్ర - మెరకముడిదాం : స్వస్థనారీ సశక్త పరివార్ కార్యక్రమం మంగళవారం డాక్టర్ అజయ్ కుమార్ ఆధ్వర్యంలో కొండలావేరు గ్రామంలో నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపు లో దాదాపు 110 మంది కి తనిఖీ చేసి తగిన మందులు ఇవ్వడం జరిగినది. ఈ 105 మందిలో 10మంది కౌమరదశలో ఉన్న పిల్లలకు మరియు 95 మందికి మహిళలు కి వైద్యపరంగా తనిఖీ చేసి తగినమందులు ఇవ్వడం జరిగింది. కౌమరదశలో ఉన్న పిల్లలకు హెచ్.బి.టెస్ట్‌లు చేసి హెల్త్ ఎడ్యుకేషన్ వివరించడం మహిళలకు పోషకహారం వ్యాధులు రాకుండా తీసువలసిన జాగ్రత్తలు వారికి తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన కోసం స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆరోగ్య గూర్చి తీసుకోవలసిన జాగ్రత్తలు ఆహార పదార్థాలు గూర్చి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమరాపు కళావతి, తెలుగుదేశం నాయకులు మాజీ సర్పంచ్ సిహెచ్ బంగారునాయుడు వి.సీతాం నాయుడు, ఏ.చిన్నంనాయుడు, జీ.చిన్నం నాయుడు ఎస్.రామకృష్ణ, వైయస్సార్ నాయకులు గేదెల తిరుపతి వై.లక్ష్మణరావు ఎంపిహెచ్ఈఓ ఎ.మురళీకృష్ణ, పిహెచ్ ఎన్‌వి రాదా భాయ్, ఎంఐహెచ్‌పి. జి.లక్ష్మి ప్రసన్న ఏఎన్ఎం ఎల్. కనకదుర్గ ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఆడ పెయ్యలకు నట్టల నివారణ మందు పట్టాలి

విశాలాంధ్ర - వేపాడ : పాడి రైతులు పశువులకు పుట్టిన ఆడ పెయ్యలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు పట్టాలని మండల పశు వైద్యధికారిణి డాక్టర్ కోరాడ గాయత్రి అన్నారు. మంగళ మండలంలోని బల్లంకి గ్రామంలో పశు ఆరోగ్య మరియు గర్భ కోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. అలాగే 30 మంది పాడిరైతులకు చెందిన 20 పశువులకి గర్భ కోశ వ్యాధులకి చికిత్సలు, 10 పశువులకి సాధారణ వ్యాధులకి చికిత్సలు, అలాగే పెయ్యలకి నట్టల నివారణ మందులు పంపిణీ చెయ్యడమైనది. అలాగే రైతులకు పాడి పశువుల్లో పునరుత్పత్తిపై దృష్టి సారించినప్పుడే పాడి పరిశ్రమ లాభదాయకంగా ఉంటుందని సూచించారు. ఈనిన తరువాత 3 మాసాలకు పశువులను కట్టించి నట్లయితే ఏటా ఒక ఈత పశువుల నుండి పొందవచ్చునన్నారు. పశువులకు పెట్టే మేపులో ఖనిజ లవణ మిశ్రమాన్ని చేర్చడం వలన సరైన నిష్పత్తిలో పోషకాలు అందుతాయని తెలియజేశారు. ఆడపెయ్యలకు క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు పట్టడం వలన త్వరగా ఎదిగి తక్కువ వయస్సు లోనే కట్టుకు వస్తాయని తెలియజేశారు. అలాగే పశువులు ఈనిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జున్ను పాలును అప్పుడే పుట్టిన దూడలకు పట్టడం వలన కలిగే లాభాలు, వర్షాకాలంలో పశువులు,జీవాల యాజమాన్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పశుగ్రాస పెంపకం వలన కలిగే లాభాలు మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వేపాడ పశువైద్య సిబ్బంది పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర - జామి : మండలంలోని జామి, జాగరం, వెన్నె గ్రామాలలో అధికారులు తమ సమక్షంలోనే రైతులకు యూరియా పంపిణీ చేపట్టారు. మంగళవారం తహశీల్దార్ కృష్ణంరాజు, ఎంపిడివో వి.నరసింహం, ఎస్ఐ వీరజనార్ధన్ ఆధ్వర్యంలో వ్యవసాయాధికారి ఎం.పూర్ణిమ రైతు సేవాకేంద్రాలలో యూరియా బస్తాలను పంపిణీ చేసారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందుగా రైతులకు ధృవపత్రాలను పరిశీలించి స్లిప్‌లను పంపిణీ చేసారు. అనంతరం స్లిప్‌ల వారీగా బస్తాలను అందజేసారు. మొత్తం ఒక్కరోజే మూడుగ్రామాలలో 36 మె.టన్నుల యూరియా పంపిణీ చేసామని ఎవో పూర్ణిమ తెలిపారు. అగ్రహారం భూముల రైతులకు సైతం యూరియా అందజేయడం జరిగిందన్నారు. అలాగే నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల వినియోగం వలన లాభదాయకంగా ఉంటుందని అవగాహన కల్పించారు.

కెంగువలో స్వసక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని కెంగువ గ్రామంలో మంగళవారం స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సర్పంచ్ ప్రతినిధి లెంక గణేష్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన ఆహారం తీసుకోవాలని, ఆహార అలవాట్లు గూర్చి వివరించారు, చిరుధాన్యాలు, పోషకాహార ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరు పల్లి పీహెచ్ సి డాక్టర్ సుష్మ, ఏఎన్ఎం మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

బ్యూటీషన్, ఫ్యాషన్ డిజైన్ ఫ్రీ కోర్స్ ప్రారంభం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా తెలగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏం ఆర్ కాలేజీ వద్ద ఏఎంఆర్ బ్యూటీ పార్లర్ అండ్ ఫ్యాషన్ డిజైనర్ అప్పికొండ సుగుణ శిక్షణ లో బ్యూటీ పార్లర్ ఫ్యాషన్ డిజైనింగ్ 60 రోజులు ఉచిత కోర్సును ప్రారంభించడం జరిగింది. ఉ: 10:30 గం:ల నుండి 11:30 గం:ల వరకు శిక్షణ ఇవ్వబడుననీ, తెలగ సోదరీమణులు అందరూ ఈ అద్భుత అవకాశాన్ని వినియోగించు కోవాలనీ జిల్లా అధ్యక్షులు పెద్ది లక్ష్మీనారాయణమూర్తి కోరారు.

మైన్స్ లీజులను పునరుద్ధరించాలి

విశాలాంధ్ర - గరివిడి : దేవాడ సదానందపురం మైన్స్ లీజులను పునరుద్ధరించి 503 మంది కార్మికుల ఉపాధి కాపాడాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో ఈరోజు డిఎఫ్ఎన్ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. దీక్షకు సిఐటియు జిల్లా కార్యదర్శి టీవీ రమణ ప్రారంభం చేశారు. యూనియన్ నాయకులు సన్యాసినాయుడు, అప్పలనాయుడు, శెనపతి రమణ, పాపినాయుడు పాల్గొన్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు పోరాటం కొనసాగుతుందని సిఐటియు నేతలు హెచ్చరించారు.

గర్భిణులకు సీమంతాలు

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో ఉద్దవోలు గ్రామంలో మంగళవారం అంగన్వాడీ సూపర్వైజర్ అపర్ణ పాల్గొని 3 గర్భిణీ స్త్రీలకు స్త్రీమంతం కార్యక్రమం నిర్వ హించారు. సూపర్వైజర్ వారితో మాట్లాడుతూ 15 రకాల కూరగాయలు, 11 రకాల తిను బండారాలు, గుడ్లు, పాలు, పళ్ళు, పప్పుదినుసులు లాంటి 50రకాల పోషకహారాలు గర్భిణీ స్త్రీలకు తినమని సూచించారు. అలాంటప్పుడే పుట్టే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. వారితో పాటు ఆ గ్రామ 3 సెంటర్లు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పోరాం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు అవకాశం

విశాలాంధ్ర - మెంటాడ : విజయనగరం విజ్జి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో మెంటాడ మండలం పోరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. యూనిట్ 14 విభాగంలో ట్రయదలిన్‌లో కాదూరు చంద్రకళ ప్రథమ, పెనుగుర్తి మధుశ్రీ ద్వితీయ స్థానం, ట్రయదలిన్‌లో అరుగోలు పూజిత ప్రథమ, తాడ్డి కావ్య ద్వితీయ స్థానం, ట్రయదలిన్‌లో కునుకు రేష్మ ప్రథమ స్థానం సాధించారు. వీరు 600 మీటర్ల పరుగులు, లాంగ్‌జంప్, హైజంప్‌లలో ప్రతిభ చూపించి, ఈ నెల 27వ తేదీ నుంచి 29వ తేదీ వరకు ఏలూరు సీతారామ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ విజయంపై హెచ్.ఎమ్. నీలాద్రినాథ్, పీ.డి. తవిటినాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థినులను అభినందించారు.

కార్మిక చట్ట ప్రకారం సెలవులు అధికారులకి మాత్రమేనా.. కార్మికులకు వర్తించవా

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విజయనరం మున్సిపాల్ కార్పొరేషన్ గా మార్పు చేసి నేటికి 10 ఏళ్లు పూర్తి అయిందని, 30 వార్డులుగా ఉన్న పట్టణం 50 డివిజన్లుగా విస్తీర్ణం పెరిగి జనాభా పెరిగినప్పటికీ. పారిశుద్య పనులు చేస్తున్న కార్మికులు సంఖ్య నేటికి పెరగడం లేదని. తక్కువ మంది కార్మికులోనే వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం నగరంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం ముందు ఎ.పి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టి అనంతరం డి.సి.ఎల్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మున్సిపల్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు చెల్లించడం లేదన్నారు. 1942 (18) చట్టం ప్రకారం రావల్సిన వారాంతపు శెలవులు మంజూరు చేయడం లేదనీ తెలిపారు. అదే విధంగా సాధారణ శెలవులు, పండగ శెలవులు, జాతీయ శెలవులు కూడా మంజూరు చేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు ఆరోగ్యం బాగులేక శెలవులు పెడితే ఆఫ్సెంట్ వేయడం, జీతాల్లో కోతలు విధిస్తున్నారన్నారు. మాకు చట్ట ప్రకారం రావలస్సిన శెలవులు ఇప్పించమని అధికారులను కోరితే నచ్చితే పనిచేయండి లేకపోతే విధులు నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 29 నగర పంచాయితీలు మొత్తం 123 అర్బన్ లోకల్ బాడీస్ ఉంటే 122 మున్సిపాలిటీల్లో వారాంతపు సెలవులు అమలు జరుగుతున్నప్పుడు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకి ఎందుకు వర్తించవని అశోక్ ప్రశ్నించారు. ఎసి రూములో పనులు చేస్తున్న అధికారులకి సెలవులు తీసుకుంటారు కానీ కార్మికులు అడిగితే విధుల నుండి తొలగిస్తామని బెదింపులకి పాల్పడతారా అని అశోక్ మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిష్కారం చేయకపోతే భవిష్యత్తు పోరాటాలకి సిద్ధం కాక తప్పదు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. రంగరాజు, జలగడుగుల కామేష్, ఉపాధ్యక్షులు కళ్యాణం శ్రీను, కార్యదర్శి తుపాకుల శ్రీను, చిరంజీవి మరియు కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన మహిళతోనే బలమైన సమాజం నిర్మాణం

విశాలాంధ్ర - రాజాం : స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగపరచుకోవడం ద్వారా బలమైన సమాజ స్థాపన జరుగుతుందని స్త్రీ ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్.గుడివాడ స్వర్ణలత అన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆదర్శ నగర్ వైద్యాధికారి డాక్టర్ యు. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో స్పెషలిస్ట్ వైద్యులు గుడివాడ స్వర్ణలత, ఆయుష్ వైద్యాధికారిణి డాక్టర్.టి. సుజాత మహిళలకు, రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ లపైన అవగాహన మరియు పరీక్షలు నిర్వహించారు. కిశోర బాలికలకు, గర్భిణీలకు, బాలింతలకు పోషకాహారం, రక్త హీనత పైన అవగాహన కల్పించడమే కాక, వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 139 మందికి పరీక్షలు చేయగా, ఆఫ్తాల్మిక్ ఆఫీసర్ ఎస్. వసంతరావు కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 9 మందికి రిఫర్ చేయడం జరిగింది. ఫిజియోథెరపీస్ట్ డాక్టర్.రవీంద్ర లెప్రసి రోగులను పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్లు మహిళలకు, కిశోర బాలికలకు పోషకాహారం పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ విజిటర్ వై.కళావతి, స్టాఫ్ నర్స్ ఏ.దేవి,లాబ్ టెక్నీషియన్ జె.సింహాచలం, కంప్యూటర్ ఆపరేటర్ కె.రాంబాబు, హెల్త్ అసిస్టెంట్ వి.రాంబాబు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొని మహిళలకు సేవలు అందించారని వైద్యాధికారి యు. కిరణ్ కుమార్ తెలియజేసారు.

దివ్యాంగుల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్న పారా స్పోర్ట్స్ జిల్లా గౌరవ అధ్యక్షులు దయానంద్

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : దివ్యాంగుల కుటుంబాల్లో పారా స్పోర్ట్స్ వెలుగులు నింపుతుందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అన్నారు. జిల్లాకు చెందిన అంతర్జాతీయ పారా మెడలిస్ట్ రెడ్డి నారాయణరావు కస్టమ్స్ డిపార్ట్మెంట్ లో ఉద్యోగం సాధించిన సందర్భంగా మంగళవారం నాడు రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి ఇతర అసోసియేషన్ సభ్యులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం దయానంద్ మాట్లాడుతూ సంకల్పం ఉంటే ప్రతిభకు వైకల్యం ఏమాత్రం అడ్డు కాదని, కృషి, పట్టుదల, నిరంతర సాధన, ఆత్మ విశ్వాసంతో దేనినైనా సాధించవచ్చని నారాయణరావు నిరూపించాడని అన్నారు. రాష్ట్రంలో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ గత పదేళ్లుగా నిర్విరామంగా కృషి చేస్తుందని, అసోసియేషన్ చేస్తున్న కృషి ఫలితంగా ఎంతోమంది పారా క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారని, అనేకమంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలను, ప్రభుత్వం అందించే లక్షలాది రూపాయిల నగదు ప్రోత్సాహన్ని అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్షులు చీమల రాంబాబు, ఎస్. కోట ప్రతినిధి పి. ప్రతాప్ వర్మ, అంతర్జాతీయ మెడలిస్ట్ శివగంగా, పి. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్యవేదిక సమావేశం

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్ : విజయనగరం ప్రెస్‌క్లబ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కులాల ఐక్యవేదిక ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐక్యవేదిక నాయకులు చూడి ఆదినారాయణ, ఇప్పిలి రామారావు, టీవీ దుర్గారావు, రొంగల రామారావు, పొంద్రంకి వెంకటరమణ, కొల్లేటి శ్రీను, మురళి, కరీం తదితరులు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు అన్ని రంగాలలో వెనుకబడిన స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో యువత ఉపాధి కోసం వలస వెళ్తోందని పేర్కొన్నారు. ఉపాధి అవకాశాల కోసం పాలకులు పరిశ్రమల దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయరంగం కుంటి నడకన సాగుతోందని, నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసి త్రాగునీరు, సాగునీరు అందించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యరంగం కోసం వైద్య కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరారు. ఉన్నత విద్యలో ప్రైవేట్ రంగం లక్షలాది రూపాయలు వసూలు చేస్తోందని, విద్యార్థులకు పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్లకు పాలకవర్గాలను పూర్తి స్థాయిలో నియమించి నిధులు విడుదల చేసి ఉపాధి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో జనగణనతో పాటు కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గంద్రేటి శ్రీను, దవ్వు శ్రీను, షణ్ముఖరావు, సిడకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పి4 అమలుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం : సుస్థిరాభివృద్ధి సాధనే లక్ష్యంగా పి4 అమలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయంలో పి4ను మరింత సమర్థవంతంగా అమలు చేసే విధానంపై ఎమినిటీస్, ప్రణాళిక కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పి4 అమలుపై విధివిధానాలను విశిధపరిచారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ఆర్థిక సాధికారతకై ప్రభుత్వం పి4 విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇప్పటివరకు జరిగిన సర్వేలో విజయనగరం నగర పాలక సంస్థ పరిధిలో 3,760 బంగారు కుటుంబాలుగా గుర్తించడం జరిగిందన్నారు. వివిధ రూపాలలో సహాయాన్ని అందించేందుకు 299 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చారన్నారు. ఒక్కొక్క మార్గదర్శి 5 కుటుంబాలను దత్తత తీసు కున్నారని అన్నారు. ఇప్పటివరకు 1,363 బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని, ఇంకా 2,397 కుటుంబాలను దత్తత తీసుకోవాల్సిందన్నారు. మార్గదర్శులు చైతన్యవంతులై మిగిలిన వారిని బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలన్నారు. ఆర్థిక, ఆర్థికేతర అవసరాలను సమకూర్చి ఆదర్శంగా నిలవాలన్నారు. ఇక నుండి సచివాలయ కార్యదర్శులు మార్గదర్శులు, బంగారు కుటుంబాలకు అనుసంధాన కర్తలుగా మాత్రమే వ్యవహరించే విధంగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో టిపిఆర్ఓ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సీతం కళాశాలలో విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంపికలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక సీతం కళాశాలలో 2(ఆంధ్ర) కాంపోజిట్ టెక్నికల్ రెజిమెంట్, విశాఖపట్నం కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ తపస్ మండల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్‌సిసి ఎంపిక శిబిరం నిర్వహించారు. ఈ ఎంపిక శిబిరంలో సుమారు 200 మంది సీతం కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అభ్యర్థులను 1600 మీటర్ల పరుగుపందెం, ఎత్తు - బరువు కొలతలు, 100 మీటర్ల స్ప్రింట్, సెటప్స్, పుషప్,లిఖిత పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆధారంగా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సీతం కళాశాల ప్రధాన సంచాలకులు డా. మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఈ ఎంపిక ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి పట్ల ఆసక్తి పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన ఉపాధ్యాయులు డా. డి.వి. రామమూర్తి, వైస్ ప్రిన్సిపల్ వెంకట లక్ష్మి,ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సిఎస్ఓ సత్యనారాయణ, పి.డి. మహేష్, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేలో జరిగిన పొరపాట్లు సరిదిద్దండి : భీశెట్టి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన రీ సర్వేలో అనేక పొరపాట్లు జరగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,రెవెన్యూ అధికారులు, సిబ్బంది, చేసిన పొరపాట్లు కి ప్రజల్ని బాధ్యులను చెయ్యడం సరికాదని జరిగిన పొరపాట్లను సరిద్దేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి రాష్ట్ర సర్వే సెటిల్ మెంట్స్ మరియూ భూమి రికార్డుల డైరెక్టర్ రోణ%శీ%కి కుర్మనాథ్‌ని కోరారు. మంగళవారం మంగళగిరి లోని డైరెక్టర్ కార్యాలయంలో ఆయన తో సమావేశమై రాష్ట్ర డైరెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు కుర్మనాథ్ ని అభినందించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రైతులు తమ భూమి హక్కులు వేరొకరి పేరుతో రికార్డుల్లో ఉన్నాయని తహసీల్దార్, ఆర్డీఓ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విసిగిపోతున్నారని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతుకు న్యాయం చేయాలని కోరామని డైరెక్టర్ కూర్మనాథ్ రైతులకు అండగా ప్రభుత్వం ఉంటుందని,రైతుల ఇబ్బందులను పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారని భీశెట్టి తెలిపారు.

చిత్రకోట, పడ్డవలసలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - బొబ్బిలి : రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమం మండలం చిత్రకోటి బడ్డవలస గ్రామంలో వ్యవసాయ అధికారి మజ్జ శ్యాంసుందర్ ఆద్వర్యంలో చేపట్టిన అవగాహన సదస్సుకు రైతులు నుండి విశేష స్పందన లభించింది. రైతులకు ప్రస్తుతం పంటలపై ఎరువులు యజమాన్యం అదేవిధంగా తెగుళ్లను గుర్తించి తదన గుణముగా తీసుకోవలసిన చర్యల కోసం రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా పొడ తెగులు పంట పొలాలలో వరి పొలాల్లో గుర్తించడం జరిగినది దాని నివారణకు హెక్సా కొనజోల్ అనే శిరింద్ర నాసిని ఎకరానికి అర లీటర్ చొప్పున పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రైతులు మరియు వ్యవసాయ సహాయకులు నాగభూషణం పాల్గొన్నారు.

జిందాల్ సమస్యకు పరిష్కారం లేదా..!

- అటు ప్రభుత్వం, ఇటు జిల్లా అధికారుల మౌనం దేనికి సంకేతం..?
- నెలల తరబడి గిరిజన రైతుల ఆందోళన కొనసాగడమేనా..!
- రైతుల ప్రశ్నలకు సమాధానం ఇచ్చేవారే లేరా..!

విశాలాంధ్ర-విజయనగరం : ఎంతో హాయిగా సాగు చేసుకుని జీవనం చేస్తున్న వారికి ఉద్యోగాల ఆశలు చూపి సాగు చేస్తున్న కన్నతల్లిలాంటి భూమిని వారికి దూరం చేసారు. తీరా ఉద్యోగాలు వస్తే బాగుపడతామనే వారి ఆశలు అడియాశలు చేస్తూ కంపెనీ పెడతామన్న యాజమాన్యం కంపెనీ ఊసే లేకుండా పోయింది. ఎటూ పాలుపోని రైతులు తమకు న్యాయం చేయాలని అధికారులను కోరితే వారి మౌనమే సమాధానం అవుతోంది. ప్రభుత్వం పట్టించుకోకపోతే తమకు మరణాలే శరణ్యమని ఆ రైతులంతా ఆవేదన చెందుతున్నారు. ఇది ఎస్‌కోట మండలంలోని జిందాల్ బాధిత గ్రామాల రైతుల సమస్య.

ఏం జరిగిందంటే..

ఎస్‌కోట మండలంలోని బొడ్డవర పరిసర ప్రాంతాలలో జిందాల్ కర్మాగారం పెట్టేందుకు ఏర్పాటు చేసారు. అందుకు అవసరమైన భూసేకరణ చేసారు. రైతులకు కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని, తగిన సదుపాయాలను, సౌకర్యాలను కల్పిస్తామని ఇలా ఎన్నో హామీలను ఇచ్చారు. ఏమీ చేయలేని గిరిజన రైతులు అధికారులు, స్థానిక నేతల మాటలను నమ్మారు. కానీ ఏళ్ళ తరబడి జిందాల్ కంపెనీ ఏర్పాటు కాకపోవడంతో తమ ఉద్యోగాల మాటేమిటని, తమ భవిష్యత్‌లు, తమ పిల్లల భవిష్యత్ గురించి నేడు రోడ్డెక్కారు. ఆనాడు మధ్యవర్తిగా వ్యవహరించిన ప్రస్తుత ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజును సైతం వదిలిపెట్టకుండా తమకు న్యాయం చేయాలని నిలదీసారు. దీంతో ఆయన సైతం వారి మాటల్లో న్యాయం ఉందని వారి పక్షాన పోరాటానికి సిద్ధపడ్డారు.

గల్లీనుంచి ఢిల్లీకి ఆందోళన

ప్రస్తుతం ఈసమస్య జిల్లానుదాటి ఢిల్లీకి చేరింది. రఘురాజు ఆద్వర్యంలో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఆందోళనగా మారింది. చివరకు మానవహక్కుల కమీషన్, ఎస్‌ఎస్టీ కమీషన్ దృష్టికి వెళ్ళింది. తమకు న్యాయం చేసేవరకు ఆందోళన ఆపేది లేదని రైతులు, మద్దతు దారులు చెబుతున్నారు. తమ డిమాండ్‌లలో న్యాయం లేకపోతే అధికారులు ఖరాఖండీగా చెప్పాలని కోరుతున్నారు.

అధికారుల మౌనం వెనుక అర్థమేమిటో..!

ఇంతలా జరుగుతున్నా మండల స్థాయినుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం వెనుక అనేక కారణాలను ప్రజలు చర్చించుకుంటున్నారు. చిన్న పాటి సమస్యపై ఆందోళన చేస్తే తరలి వచ్చే అధికారులు ఇంతస్థాయిలో ఆందోళన రోజుల తరబడి జరుగుతున్నా పట్టించుకోకుండా ఉండడం అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు పోలీసులు రైతుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం మరో అంశంగా మారింది. తమను బెదిరిస్తున్నారని పలువురు ఆందోళనా కారులు ఆరోపిస్తున్నారు. ఇక ఆందోళన ప్రదేశంలో పోలీసులతో జిందాల్ యాజమాన్య ప్రతినిధిలు చెట్టాపట్టాలు వేసుకుని తిరగడం చూసిన రైతులు మరింత ఆవేశానికి లోనవుతున్నారు. ఈసమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో ఏవిదంగా పరిష్కారం చూపుతారో వేచి చూడాలి మరి..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - రాజాం: రాజాంలోని లక్కీ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ ప్రధాన అతిథిగా హాజరై ప్రజలకు సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు గురించి విపులంగా వివరించారు. ఈ సందర్భంగా సిఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అధికమవుతున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్కీ షాపింగ్ మాల్ యాజమాన్యం, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సిరిమాను చెట్టును దర్శించుకున్న మజ్జి శ్రీను

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం కొండ తామరపల్లి గ్రామంలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు పైడితల్లి అమ్మవారి సిరిమాను చెట్టును జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీను (చిన్న శ్రీను), గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కెవివి సూర్యనారాయణ రాజు(పులి రాజు), గంట్యాడ జడ్పీటీసి వర్రి నరసింహమూర్తి, వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు జై హింద్ కుమార్, జామి వైసీపీ మండల పార్టీ ప్రెసిడెంట్ గొర్ల రవి, వేపాడ ఎంపీపీ దగ్గు సచ్చివంతుడు(సతీష్), వేముల ముత్యాలు నాయుడు, లచ్చిరెడ్డి, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో ఆయుర్వేద డే

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: మహారాజా కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో నేషనల్ ఆయుర్వేద డేను పురస్కరించుకుని "ఆయుర్వేద్ ఫర్ పీపుల్ అండ్ ప్లానెట్" అనే థీమ్‌తో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో "మార్కెట్లో లభించే ఔషధ నమూనాల్లో కల్తీ పదార్థాల గుర్తింపు" పై ప్రదర్శన చేసి, వివిధ కల్తీ పదార్థాలను గుర్తించే విధానాన్ని విద్యార్థులకు చూపించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రామయ్య మాట్లాడుతూ ఆయుర్వేద జ్ఞానానికి శాస్త్రీయ ఆధారాలను కల్పించడం ద్వారా అది మరింత విశ్వసనీయంగా మారుతుందన్నారు.

ఆడ బిడ్డల ఆరోగ్యం కోసమే స్వశక్తి పరివార్ అభియాన్

విశాలాంధ్ర - మెరకముడిదాం: మండలంలో మెరకముడిదాం పిహెచ్‌సి ఆవరణలో స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలకు స్క్రీనింగ్ నిర్వహించబడింది. రక్త పోటు, మధుమేహం , నోటి కాన్సర్, రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ కాన్సర్, పోషణ అభియాన్ , ఈట్ రైట్ (సరైన ఆహారం తీసుకోవడం) తల్లీబిడ్డల సేవలు వయో వృద్ధుల ఆరోగ్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో డా . కే అజిత్ బాబు, డా. సుమాలిక (జనరల్ ఫిజిషయన్), డా . షారోన్ బిందు (ఆయుష్) , కంటి విభాగం పుష్పగిరి హాస్పిటల్ గణేష్ అమృత పాల్గొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ రామప్పల నాయుడు బదిలీ

విశాలాంధ్ర - రాజాం: రాజాం మున్సిపల్ కమిషనర్‌గా ప్రజాసేవలో విశేష ప్రతిభ కనబరిచిన జె. రామప్పల నాయుడును ప్రభుత్వం బదిలీ చేస్తూ తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా నియమించింది. పట్టణ ప్రజల సమస్యలను గమనించి, అభివృద్ధి పనుల్లో తక్షణమే ముందడుగు వేసే అధికారి అని ఆయనకు మంచి పేరు వచ్చింది. రాజాంలో బాధ్యతలు స్వీకరించిన రోజునుంచే శుభ్రత, రోడ్ల విస్తరణ, నీటి సరఫరా, మురుగు నీటి సమస్యలు వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రత్యేకంగా రోడ్డు విస్తరణ పనుల్లో ప్రజలను సునాయాసంగా ఒప్పించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేయించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు ఆయన విధానాన్ని అభినందిస్తూ, "రామప్పల నాయుడు వల్ల రాజాం పట్టణం కొత్త రూపు దాల్చింది. ఆయన అభివృద్ధి దృష్టి తెనాలి పట్టణానికి కొత్త ఊపునిస్తుంది" అని అన్నారు. అధికారిగా మాత్రమే కాకుండా ప్రజలతో కలిసిపోయి పనిచేసే వ్యక్తిగా ఆయన పేరు సంపాదించుకున్నారు.

రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సలపై అవగాహన

విశాలాంధ్ర - శృంగవరపుకోట: పట్టణంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ లైఫ్ సపోర్ట్ అనే అంశంపై కాలేజీ విద్యార్థులకు, లెక్చరర్లకు మంగళవారం అవగాహన కల్పించడం జరిగిందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్.కోట బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పొట్నురు వరలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డిగ్రీ కాలేజీ రెడ్ క్రాస్ సొసైటీ వై ఆర్ సి కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాసరావు కోఆర్డినేట్ చేయగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ కేశవరావు అధ్యక్షత వహించారని అన్నారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ జిల్లా కోఆర్డినేటర్ మన్మధరావు గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయినప్పుడు వెంటనే చేయవలసిన ప్రథమ చికిత్స సిఆర్‌పి గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ డి సూర్యారావు, ఎస్.కోట బ్రాంచ్ వైస్ చైర్మన్ ఏ మల్లేశ్వరరావు, ఎంసి మెంబర్ ఆర్ దుర్గాప్రసాద్, లైఫ్ మెంబర్ డాక్టర్ గణేష్, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు, అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణలు

జిల్లా మేనేజర్ బి రెబెక్కా శామ్యూల్

విశాలాంధ్ర -విజయనగరం: నందమూరి తారక రామారావు (ఎన్.టీ.ఆర్)మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం) ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఎనిమిదవ తరగతి చదివిన 18 నుండి 40 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడు తున్నాయని జిల్లా మేనేజర్ బి రెబెక్కా శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్ కోర్స్ కు 60 రోజులు, హ్యాండ్ ఎంబ్రాయిడరీ కోర్స్, జ్యూట్ బ్యాగుల తయారీ లకు 45 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తగిన అర్హతలతో ఈ నెల 26 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమాల ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నామన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - తెర్లాం: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెర్లాం తహసీల్దార్ హేమంత్ కుమార్ అన్నారు. ఉరుములు మెరుపులతో వర్షాలు కురుస్తున్నందున బయట చెట్ల క్రింద కానీ, విద్యుత్ స్థంబాల వద్ద ఉండకూడదన్నారు. మేకలు కాపరులు, గొర్రెలు కాపరులు, పశువులు కాపరులు, వ్యవసాయం, కూలీ పనులకు వెళ్లిన రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో జిల్లా ముందుండాలి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విశాలాంధ్ర - విజయనగరం: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పర్చేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రామసుందర్ రెడ్డి అన్నారు. జిల్లాలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యాచరణ అమలు తీరును కలెక్టర్ ఛాంబర్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీడీవో లతో సమీక్షించారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థల్లో నిర్ణీత లక్ష్యాలు సాధిస్తున్నారని అదే విధంగా గ్రామాల్లో కూడా నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో సామూహిక మరుగుదొడ్ల పనులు వేగవంతం చేయాలని ఆర్ డబ్ల్యు ఎస్ ఈ ను ఆదేశించారు. గ్రామ స్థాయి లో తడి చెత్త పొడి చెత్త సేకరణ వివరాలు ప్రతి రోజు పి ఆర్ 1 యాప్ లో అప్లోడ్ చేయాలని అన్నారు. వారం లోగా శతశాతం లక్ష్యాలు సాధించాలని తెలిపారు. చెత్త నుండి సంపద కేంద్రాలను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారిని ఆదేశించారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం కొరకు అందిన దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని అన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఓ బాలాజీ, సి.ఈ.ఓ సత్యనారాయణ, డి.పి.ఓ మల్లికార్జున రావు, ఆర్.డబ్ల్యు.ఎస్ ఎస్.ఈ కవిత, మున్సిపల్ కమిషనర్లు నల్లనయ్య, రామలక్ష్మి, అప్పలనాయుడు,హౌసింగ్ పి డి మురళి ,వర్చువల్ గా ఎం.పి.డి.ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు అనుమతులు

- నేటి నుండి జిందాల్ భూ నిర్వాసితుల నిరసన

విశాలాంధ్ర - శృంగవరపుకోట: బుధవారం నుండి మండలంలోని మూల బొడ్డవర రైతు సేవా కేంద్రం వద్ద జిందాల్ భూ నిర్వాసితుల నిరసన తెలియజేసేందుకు పోలీసులు అనుమతి ఇచ్చారని జిందాల్ భూ నిర్వాసితులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిందాల్ సంస్థ తమ భూములను తీసుకుని ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసం చేసిందని నేటికీ 95 రోజులుగా నిరసన చేపడుతున్నామని నిరసన చేయడానికి అనుమతి కోరుతూ పలుమార్లు దరఖాస్తులు సమర్పించామన్నారు. కానీ దురదృష్టవశాత్తు, పేద గిరిజన, హరిజన రైతుల గొంతు వినపడకూడదని నిర్ణయించుకున్న పోలీసులు, అధికారులు తమ విన్నపాలను పదే పదే తిరస్కరించారని అందుకు గాను తాము గౌరవ న్యాయస్థానంను ఆశ్రయిస్తే, తమ అభ్యర్థనలను పరిశీలించిన గౌరవ న్యాయస్థానం, తమకు అనుమతి ఇవ్వాలని పోలీసులను ఆదేశించిందని అన్నారు. తమ నిరసనను అణచివేయాలని, తమ ఆవేదనను ఈ ప్రపంచానికి తెలియకుండా చేయాలని చేస్తున్న కుట్ర అని అన్నారు బుధవారం నుండి ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు నిరసనను చేస్తున్నట్లు తెలిపారు.

జీఎస్టిలో విప్లవాత్మకమైన మార్పులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ దేశ చరిత్రలో కొత్త శకానికి నాంది పలుకుతూ, ప్రతి వర్గానికీ మేలు చేకూర్చే నూతన పన్నుల విధానం జీఎస్టీ 2.0 నిన్నటి నుండి అమలులోకి వచ్చిన సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్‌కి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం స్థానిక కోట నుండి గంటస్తంభం వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజేష్ వర్మ మాట్లాడుతూప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం స్వతంత్రభారత చరిత్రలో మొదటిసారి భారీగా ధరలు తగ్గించి రైతు నుండి విద్యార్థి వరకు,వ్యాపారి నుండి వినియోగదారు వరకు, అందరికీ ఊరట ఇచ్చే ఈ జీఎస్టీ సంస్కరణలతో పేద,మధ్య తరగతి ప్రజలకు ఉపయోగపడేందుకు జిఎస్టిలో విపవాత్మక మైన మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని , జిల్లా ప్రధాన కార్యదర్శి పతివాడ రాజేష్ , జిల్లా ఉపాధ్యక్షులు చొక్కాకుల అప్పారావు, నీలాపు దేవి, దోమ కామేశ్వరి, జిల్లా కార్యదర్శులు ,చింతపల్లి అప్పారావు గారు ,పావని తిప్పాన పావని, సోషల్ మీడియా కన్వీనర్ మజ్జి రామారావు, యువ మోర్చా నాయకులు రాజాన రమణ, తాటి నానాజీ, మజ్జి రమేష్ బాబు, తమటకు రాముడు,మన్నెపురి శ్రీను, గిరీష్, మహిళా నాయకులు గండికోట శాంతి , వై స్మిత, మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ

విశాలాంధ్ర - రేగిడి : రేగిడి మండలం, కొమెర గ్రామం: రైతుల కోసం కేంద్రం ఏర్పాటు చేసిన రైతు సేవ కేంద్రంలో పోలీసుల సమక్షంలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు సమక్షంలో, రైతులకు యూరియా పంపిణీ చేశారు. యూరియా లభిస్తున్నదని తెలిసినప్పటి నుండే రైతులు తరలివచ్చారు.

ఖండ్యంలో జాతీయ ఆయుర్వేద దినోత్సవం

విశాలాంధ్ర - రేగిడి: రేగిడి ఆమదాలవలస మండలం ఖండ్యం గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్ కుమార్ ఆధ్వర్యంలో 10వ జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయుర్వేద పితామహుడు ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు అర్పించి ఘన నివాళులు సమర్పిస్తూ ఆయుర్వేద వైద్యం ప్రాముఖ్యతను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గొలివి హరి ప్రసాద్, బూసి ప్రసాద్, గ్రామ సచివాలయ కార్యదర్శి పోలినాయుడు, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన

విశాలాంధ్ర - మెరకముడిదాం: స్థానికంగా దొరికే ఉత్పత్తులు లో ఉన్న పోషక విలువలు గురించి మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న ప్రీస్కూల్ బొమ్మలు, మెటీరియల్ గురించి తల్లులకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ పర్యవేక్షరాలు తాడ్డి శ్రీదేవి వివరించారు. మంగళవారం మండలంలో గల సిరియాలపేట అంగన్‌వాడీ కేంద్రంలో 8 వ రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పోషక విలువలు బయటకు పోకుండా వండే పద్ధతిని వివరించారు. ఈ కార్యక్రమం లో తల్లులు అంగన్‌వాడీ కార్యకర్త కె.శ్రీనమ్మ ,ఆయా పాల్గొన్నారు.

కోలగట్ల శ్రావణికి అభినందనల వెల్లువ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఇటీవల కాలంలో నూతనంగా నియమితులైన కోలగట్ల శ్రావణికి అభినందనలు కొనసాగుతున్నాయి. మంగళవారం మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో మజ్జి ఆదినారాయణ అధ్యక్షతన 46వ డివిజన్ నుండి వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దొంతల శ్రీను, కని మెరక తౌడులు కోలగట్ల శ్రావణికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గణపతి, సత్యనారాయణ, నిరంజన్, నరేష్, రాజు, చక్రవర్తి పాల్గొన్నారు.

జంక్ ఫుడ్స్‌కు చిన్నారులను దూరంగా ఉంచండి

విశాలాంధ్ర - బొబ్బిలి : ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి జాగాన విజయలక్ష్మి ఆధ్వర్యంలో పిరిడి సెక్టార్ పరిధిలో గల దిబ్బగుడ్డివలస గ్రామంలో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం చాలా ముఖ్యం అన్నారు. జంక్ ఫుడ్స్‌తో అనేక రోగాలు వస్తాయని వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పిరిడి సెక్టార్ పర్యవేక్షకులు కె పద్మ , మండల టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, గ్రామ ఎంపీటీసీ సభ్యులైన నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు ఈ-క్రాప్ తప్పనిసరి

విశాలాంధ్ర - రామభద్రపురం: రైతులు వేసే ప్రతి పంటకు ఈక్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్‌రావు అన్నారు. మంగళవారం కొట్టక్కి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతుల పంటలు పోయినప్పుడు చేయించుకుంటే వాటికి ప్రభుత్వం నష్టపరిహారం అందజేస్తుందని అలాంటి సమయాలలో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే రైతులందరూ ఎరువులు వాడకం బాగా తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి శివా సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - గరివిడి: గరివిడి పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ ఆచార్య డాక్టర్ మక్కెన శ్రీను అధ్యక్షతన ఓఇయు లయన్స్ ఐ హాస్పిటల్ సహకారంతో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని ఉచిత కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ సునీల్ కుమార్ తంగరాజు ప్రధాన అతిథిగా హాజరై కంటి సమస్యలు, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ సిహెచ్. జ్యోతి శ్రీ, డాక్టర్ ఎస్. గంగు నాయుడు, డాక్టర్ వై. స్వాతి, డాక్టర్ కే. మనోజ్ పర్యవేక్షించారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ

విశాలాంధ్ర - దత్తిరాజేరు: మండలంలో గల షికారుగంజి ఆదర్శ పాఠశాలలో దసరా సెలవుల్లో భాగంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వృత్తి విద్య అధ్యాపకుడు బి.కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోమోటివ్ రంగంపై విద్యార్థులు చురుకుగా పాల్గొనాలని అన్నారు. వృత్తి విద్యతో రాబోయే రోజుల్లో మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్లను కలిసిన మున్వర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా నియమితులైన ఎం.డి మున్వర్ మంగళవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్ల ఎం.డి మున్వర్ కు శుభాకాంక్షలు తెలిపారు మరెన్నో ఉన్నత పదవులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగర "కో ఆప్షన్" సభ్యులు రహీం, వైసిపి సీనియర్ లీడర్ బాయిస్, మరియు మైనారిటీ సభ్యులు సర్దార్, సల్మాన్ తోపాటు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

విశాలాంధ్ర - డెంకాడ: మండల కేంద్రంలోని గల రైతు భరోసా కేంద్రంలో, సాయి కృష్ణ రైతు మిత్ర గ్రూప్ ఎరువుల షాపుల వద్ద మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి సంగీత, తహశీల్దార్ రాజారావు, ఎస్సై సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిని సంగీత మాట్లాడుతూ రైతులకు కావలసిన యూరిన్ విడతల వారీగా తీసుకువచ్చి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రామకోటి, విఏఏలు లేనిన్, రాంబాబు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పేజి : 3
విజయనగరం
బుధవారం 24, సెప్టెంబర్ 2025

చంపావతి నదిలో యువకుడు గల్లంతు... ముమ్మర గాలింపు

విశాలాంధ్ర - మెంటాడ : మెంటాడ మండలం మెంటాడ పంచాయతీకి చెందిన చల్ల కృష్ణ 34సంఅనే యువకుడు మంగళవారం పశువులను మేతకు తీసుకువెళ్తూ చంపావతి నది దాటాడు. ఉదయం నుంచి కురిసిన భారీ వర్షాల ప్రభావంతో చంపావతి నది పొంగిప్రవహిస్తుండగా, సాయంత్రం పశువులను తిరిగి ఇంటికి తీసుకువస్తున్న సమయంలో నది దాటు తున్న చల్ల కృష్ణ ప్రవాహానికి కొట్టుకు పోయాడు. సమాచారం అందిన వెంటనే స్థానికులు, రెవెన్యూ అధికారులు పోలీసులు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని నది ఇరువైపులా ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు అతని ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

ఇంజినీర్లు సమస్య పరిష్కార ప్రతినిధులుగా మారాలి : మాజీ డైరెక్టర్ జనరల్ చక్రపాణి

విశాలాంధ్ర - డెంకాడ : మండల కేంద్రంలోని జొన్నాడ వద్దనున్న లెండి ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రతి ఏడాది వ్యక్తిత్వ వికాస తరగతులలో భాగంగా లెండి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులకు నిర్వ హించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిసోర్స్ డెవలప్మెంట్ యొక్క మాజీ డైరెక్టర్ జనరల్ డి. చక్రపాణి ఐఏఎస్ మరియు పార్వతీ పురంకు చెందిన జట్టు ఆశ్రమానికి చెందిన ప్రఖ్యాత సామాజిక కార్యకర్త పద్మజ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఫస్ట్ ఇయర్ ఇంజనీరింగ్ విద్యా ర్థులను ఉద్దేశించి మాట్లాడిన చక్రపాణి, ఇంజనీరింగ్ పయనాన్ని గొప్ప కట్టుబాటుతో ప్రారం భించమని సూచించారు. ఇంజనీర్లు సమస్యలను పరిష్కరించే నైపుణ్యం పొందడానికి లోకజ్ఞానం ఎంత ముఖ్యమో ఆయన నొక్కి చెప్పారు. క్రమశిక్షణ వ్యక్తి జీవితాన్ని తీర్చి దిద్దడంలో ఎంత ప్రధాన పాత్ర పోషిస్తుందో వివరించారు. అధ్యాపకులను ఉద్దేశించి, ప్రపంచం ఎదు ర్కొంటున్న ఆధునిక సమస్యలపై సృజనాత్మకంగా, విమర్శనాత్మకంగా జ్ఞానం సంపాదించి, అదే విద్యార్థుల్లో పెంచాలని ఆయన ఆహ్వానించారు.శ్రీమతి పద్మజ గారు విద్యార్థులను ఉద్దేశించి బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్' అనే భావనపై ప్రేరణాత్మక ప్రదర్శన చేశారు. వాడిన ప్లాస్టిక్ బాటిళ్లు, పెన్లు, ఇతర వస్తువులను ఉపయోగించి ఉపయోగకరమైన వస్తువులు ఎలా తయారు చేయవచ్చో చూపించారు. స్థిరమైన భవిష్యత్తు నిర్మాణంలో యువత పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు.ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.రామా రెడ్డి, చైర్మన్ పి.మధుసూదనరావు, సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.శివరామ కృష్ణ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, అన్ని విభాగాధిపతులు అతి థులను సన్మానించారు. ఈ కార్య క్రమాన్ని శాస్త్ర మానవీయ విభాగాధిపతి డాక్టర్ పి.దుర్గా సైలజ పర్యవేక్షణలో, భాషా అధ్యా పకులు కావ్య, రాణి, రాజా, శీబా, జ్యోత్స్న సహ కారంతో సమన్వయం చేశారు. ఈ కార్య క్రమం విద్యార్థులు, అధ్యాపకుల్లో అకాడమిక్ సామాజిక బాధ్యతలపై కొత్త ఉత్సాహం కలిగించింది.

బెల్టు షాపులపై గట్టి నిఘా ఉంచాలి

విశాలాంధ్ర - రాజాం : విజయనగరం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ పి. రామచంద్రరావు రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై ఆయన మాట్లాడుతూ బెల్టు షాపులపై గట్టి నిఘా పెట్టాలని, పాత మరియు కొత్త కేసుల్లో దొరికిన అనుమానితులపై బైండ్ ఓవర్ కేసులు నమోదు చేసి వారిని కట్టడి చేయాలని ఆదేశించారు.ప్రజా ఫిర్యాదులపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సారాయి ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, నాన్-డ్యూటీ పేడ్ లిక్కర్ పై ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ సేకరించి పూర్తి నిరోధానికి కృషి చేయాలని తెలిపారు. రాబోయే దసరా పండుగ సమయంలో అసాంఘిక శక్తులపై డేగ కన్నుతో వ్యవ హరించాలని, మద్యం షాపులు, బార్లు అన్ని నియమ నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడాలని ఆదేశించారు.తద్వారా సిబ్బంది తమ విధుల్లో ఎదుర్కొంటున్న కష్టనష్టాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజాం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. జైభీమ్, సబ్ ఇన్స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించి, సైడ్ వాల్స్ నిర్మించలేదని పలువురు ఆందోళన

విశాలాంధ్ర - రాజాం : రాజాం పట్టణ పరిధిలోని గాయత్రి కాలనీ సమీపంలో విజయనగరం - పాలకొండ ప్రధాన రహదారిపై పాడైపోయిన మూడు కల్వర్టు ల స్థానంలో కొత్తగా నిర్మించిన కల్వర్టు పనులు మాత్రం పూర్తి చేశారు వీటిలో ఇప్పిలిపేట వద్ద ఉన్న కల్వర్టుపై సైడ్ వాల్స్ కూడా పూర్తి చేశారు. రాజాం సమీపంలో ఉన్న గాయత్రి కాలనీ వద్ద నిర్మించిన కల్వర్టుకు మాత్రం సైడ్ వాలు నిర్మించకపోవడంతో ఇప్పుడు స్థానికులలో ఆగ్రహానికి కారణమైంది. కల్వర్టు నిర్మాణం పూర్తయినా, దానికి అవసరమైన సైడ్ వాల్స్ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేయడంతో ఆ ప్రాంతం రోజురోజుకూ ప్రమాదకరంగా మారిపోతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దాదాపు నెల క్రితమే కల్వర్టు పనులు ముగిసినా, రహదారికి రక్షణ కల్పించే సైడ్ వాల్స్ నిర్మాణం లేకపోవడం వలన వాహనదారులు, పాదచారులు ఎప్పుడైనా ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో విజిబిలిటీ తక్కువగా ఉండటంతో ప్రమాదాలు ముప్పు మరింతగా పెరిగిందని స్థానికులు చెబుతున్నారు.పనులు మొదలు పెడితే సురక్షితంగా పూర్తి చేయాలి,సగం చేసి వదిలేయడం అంటే నిర్లక్ష్యం మాత్రమే. ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరగొచ్చు" అని గాయత్రి కాలనీ నివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయమై విశాలాంధ్ర ప్రతినిధి ఆర్ %ఒ% బి అధికారిని సంప్రదించగా %-% త్వరలో సైడ్ వాల్స్ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అయితే స్థానికులు మాత్రం గత నెలలుగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణిస్తున్న నేపథ్యంలో కల్వర్టు పక్కన తక్షణమే సైడ్ వాల్స్ నిర్మించకపోతే పెద్ద ప్రమాదాలు తప్పవు అని ప్రజలు హెచ్చరిస్తున్నారు. ప్రజల భద్రత కోసం ఉన్నత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

210 మంది విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - రాజాం : విద్యార్థులు క్రమం తప్పకుండా దంత వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని డాక్టర్. సంజన మల్లి స్పెషలిస్ట్ లేజర్ దంత వైద్యశాల వైద్యులు డాక్టర్ తిర్లింగ్ మోహన్ అన్నార్ మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ శిక్షణా సంస్థలో విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. 210 మంది విద్యార్థులకు మరియు కళాశాల సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించి తన సూచనలు తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బందారు.భాస్కరరావు,ఎస్. లక్ష్మణరావు, ట్రైనింగ్ ఆఫీసర్, ప్రాంతీయ యోజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్ మరియు కళాశాల సిబ్బంది మండల చైతన్య, కొల్ల యశస్ మరియు మార్గాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉద్దవోలులో వైద్య సేవలు

విశాలాంధ్ర - తెర్లాం : మండలంలో ఉద్దవోలు గ్రామ సచివాలయంలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న పెరుమాలి పిహెచ్‌డాక్టర్ వెంకట్రావు. మంగళవారం మెడికల్ క్యాంప్ లో భాగంగా ఉద్దవోలు గ్రామంలో అనారోగ్యంతో వచ్చిన ప్రజలకు బిపి సమస్యలు ఉన్నాయో బిపి, షుగర్, కాళ్ళనొప్పులు లాంటి సమస్యల తో వచ్చిన రోగులను అడిగి తెలుసుకుని వారికి మందులు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ తో పాటు విలేజ్ ఎంఎల్‌హెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంలో 15% వృద్ధి రేటు సాధించాలి

జిల్లా కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల పనితీరుపై కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ అనుబంధ రంగాలలో 15% వృద్ధి రేటు సాధించే విధంగా ఆయా రంగాలు కృషి చేయాలని సూచించారు.వరిసాగు పంటలలో గత ఏడాది 95% లక్ష్యం సాధించగా ఈ ఏడాది 97% చేరుకుందని తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కి తగిన విధంగా సాగు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సమయానికి అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చేపట్టాలన్నారు. రైతులకు ఇ-పంట బుకింగ్, ఫార్మ్ మెకానైజేషన్ (వ్యవసాయ యంత్రాలు), డ్రోన్స్ వినియోగం వంటి సదుపాయాలను విస్తరించాలని ఆదేశించారు. పశుసంవర్థక రంగంలో పాలు, మాంసం గుడ్లు 8.4% పెరుగుదల వల్ల ఉత్పత్తిలో 15% వృద్ధి సాధించవచ్చునన్నారు. ఏపీఎంఐపి పథకాలు విస్తృత పరచాల్సాలన్నారు.రైతు బజార్లు, శుభ్రత, పరిశు భ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, రైతు బజార్లను సందర్శిస్తామని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భారతి, జిల్లా ఉద్యాన అధికారి చిట్టిబాబు, జిల్లా పశు సంవర్థక అధికారి దామోదర్ రావు, ఏపీఎంఐపి పిడి పి.ఎన్.వి లక్ష్మీనారాయణ, మార్కెట్ డి ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పట్టణంలో ఎస్ కోట కోఠీ లోకలైజ్ పిహెచ్‌సి వైద్యులు మానస, సోషల్ ఆధ్వర్యంలో మంగళవారం స్వస్థ నారి సశక్త పరివారం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ మానస ఆధ్వర్యంలో 103 మందికి వైద్య చికిత్సలతో పాటు వారికి రక్త పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా రక్త పోటు షుగర్ వ్యాధి రక్తంలో హెచ్ బి శాతం గుర్తించడం నోటి రొమ్ము గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ను తొలి దశలోనే గుర్తించడానికి పరీక్షలు చేయడం జరిగింది. దీనికి తోడు సమాజంలో అధికంగా ఉన్న క్షయ వ్యాధిని తొలి దశలో గుర్తించడం యుక్త వయసు బాలికలలో రక్తహీనతను గుర్తించడం వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో లేని వారిని గుర్తించి వారికి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో జరిగినది. ఈ కార్యక్రమానికి శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషి, ఎంఎల్ హెచ్పి ఏఎన్ఎం ఆశా అంగన్వాడి కార్యకర్తలు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - గరివిడి : గరివిడి పట్టణంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటు కొనసాగే ఈ నవరాత్రి సందర్భంగా పట్టణమంతా భక్తి సందడి నెలకొంది.ఫెర్రో అల్లాయిస్ యాజమాన్యం ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా అద్భుతంగా దేవి మండపాన్ని తీర్చిదిద్దింది. విద్యుద్దీపాల కాంతులు, పుష్పాల తోరణాలు, సుందర అలంకరణలతో మెరిసే ఈ మండపంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారి దర్శనం పొందుతున్నారు.పాత గరివిడి, ఫెకర్ రోడ్,ప్రాంతాల్లో లారీ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతీ మండపం ప్రత్యేక శైలిలో అలంకరించబడడంతో భక్తుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.రాత్రి వేళ భజన బృందాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, హారతి పోటీలు నిర్వహించడంతో ఉత్సవాల సందడి మరింతగా పెరిగింది. విద్యుద్దీపాల కాంతులు, శబ్దనాదాలతో పట్టణమంతా పండుగ వాతావరణంలో మునిగిపోయింది. మహిళలు, చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొంటూ భక్తి, ఆనందాలను పంచుకుంటున్నారు.